ప్రజాశక్తి

సోమవారం 8 మే 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

పంట నష్టం అంచనాలకు మండల, గ్రామస్థాయిలో కమిటీలు

నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రైతులంటూ చంద్రబాబు నాయుడు పడుతున్న ఆరాటం, 2లో

పల్నాడులో పులి గిలి

పులుల సంచారంపై దొరకని ఆచూకి - ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



పల్నాడు జిల్లా అటవీ ప్రాంతంలో పులుల సంచారం పలు గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బొల్లాపల్లిలో ఇద్దరు మహిళలను పులి గాయపర్చినట్టు ఒక వీడియో ఆదివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో పల్నాడు జిల్లా వాసులు మరింత భయాందోళనకు గురయ్యారు. వాస్తవంగా ఈ వీడియో తమ ప్రాంతానికి చెందినది కాదని, మహిళలను పులి గాయపర్చినట్టు ఎక్కడా సమాచారం లేదని అటవీ శాఖ అధికారులు వివరణిచ్చారు. ఇది ఫేక్ వీడియో అని ఎవ్వరూ ఇలాంటి వదంతులు నమ్మవద్దని అన్నారు. మరోవైపు దుర్గి మండలం గజాపురంలో గతనెల 26న ఆవును పులి వేటాడిన ఘటనతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులుల జాడపై దృష్టి సారించారు. అయితే ఇప్పటి వరకు అధికారులకు జాడ తెలియలేదు. దాదాపు 10 రోజులు దాటినా 2లో



బాధితులతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

పేదల ఇళ్ల కూల్చివేత అన్యాయం

- రోడ్డు విస్తరణ సాకుతో అధికారుల దుశ్చర్య
- ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తే ఉద్యమం
- ఆత్మకూరులో బాధితులను పరామర్శించిన సిపిఎం

5లో

పంట నష్టం అంచనాలు నమోదు

- వర్షాలు ఆగగానే పూర్తిస్థాయి పరిశీలన
- ఆర్‌బికేల ద్వారా తొలకరి విత్తనాలు సిద్ధం
- ప్రజాశక్తితో వ్యవసాయశాఖ గుంటూరు జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

8లో

నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

జిల్లా ప్రత్యేకాధికారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇంతియాజ్ అహ్మద్ 2లో

ప్రశాంతంగా నీట్ పరీక్ష 8లో

పల్నాడులో పులి గిలి

(మొదటి పేజీ తరువాయి)

పులుల జాడను అధికారులు కనుగొనలేకపోయారు. అడవిలో నుంచి పొలాల్లోకి వస్తే ఏం చేయాలని రైతులు భయపడుతున్నారు. ప్రధానంగా పశువుల కాపర్లు పరిస్థితి అయోమయంగా ఉంది. పులుల జాడ కోసం జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు ఆధ్వర్యంలో అధికారులు గ్రామాల్లో తిరిగి పులులకు ఎలా దూరంగా ఉండాలి.. పులుల బారిన పడకుండా ఎలా భయటపడాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న పొలాలకు చెందిన రైతులు, పశువుల కాపర్లు ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని సూచిస్తున్నారు. అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు, ప్రైజర్ ఇంప్రెన్సివ్ ప్యాడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

పులులు ఎటు నుండి వస్తాయోనని మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలు భయపడుతున్నారు. ప్రధానంగా అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు మరింతగా ఇబ్బంది పడుతున్నారు. పల్నాడు జిల్లా సరిహద్దు గ్రామాల్లో క్షణ,క్షణం భయం భయంగా మారుతోంది. ఇటీవల పులుల ఉత్పత్తి పెరగడం వల్ల శ్రీశైలం, నల్లమడ అటవీ ప్రాంతంలో పులులు ఉన్నట్టు గుర్తించారు. వీటి పాదముద్రల ఆధారంగా వీటి కదలికలపై నిఘావిధించారు. పులుల జాడ కోసం సాంకేతిక అంశాలపై దృష్టి సారించినట్టు పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు తెలిపారు. అటవీశాఖ అధికారులు పెట్రోలింగ్ కూడా చేస్తున్నట్టు చెప్పారు.

ఇటీవల గజాపురం, కాకిరాల గ్రామాల్లో సంచరించినట్టు గుర్తించారు. మొత్తం 50 సిసి కెమెరాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ టైగర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 75 పులులు ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టు నుంచి రాజానగర్, కాకిరాల గ్రామాల వైపు పులులు సంచరించినట్టు గుర్తించి అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. వేసవిలో తాగునీరు లభ్యంకాక పులులు బయటకు వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇటీవల గజాపురం సమీపంలోని నెమలికంటి చెరువు వద్దకు వచ్చిన సందర్భంలో ఆవుపై దాడి చేసినట్టు అధికారులు గుర్తించారు.



మాట్లాడుతున్న డాక్టర్ పవని ప్రియాంక

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- తెనాలి

వాతావరణ మార్పులతో సంభవించే ఆరోగ్య సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హ్యాపీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పవని ప్రియాంక అన్నారు. స్థానిక చినరావూరు ఆర్.సి.యం చర్చి ఆవరణలో హ్యాపీ హాస్పిటల్, రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ పవని ప్రియాంకతో పాటు డాక్టర్ ఈవూరు శ్రీకాంత్, డాక్టర్ గురునాథ్ శర్మ ,డాక్టర్ శ్వేత, డాక్టర్ ధనుంజయ్ బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడుతూ ప్రస్తుతం విపరీతమైన ఎండలు, అదే సమయంలో వర్షాలతో వాతావరణం ఎప్పటికప్పుడు మారుతుందన్నారు. ఈ పరిస్థితులు ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపుతాయన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు తీసుకోవాలని ఆమె సూచించారు. రెడ్ క్రాస్ కార్యదర్శి భానుమతి మాట్లాడుతూ ఇప్పటివరకు హ్యాపీ హాస్పిటల్‌తో కలిసి దాదాపు 50 పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. రెవరెండ్ ఫాదర్ మరియదాసు, రెవరెండ్ పోలిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

గుంటూరు జిల్లా ప్రత్యేకాధికారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇంతియాజ్ అహ్మద్

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లాలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు వివరించాలని జిల్లా ప్రత్యేకాధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అడిషనల్ సీసీఎల్‌ఏ, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ అహ్మద్ చెప్పారు. అకాల వర్షాల వల్ల ఏర్పడిన పంట నష్టంపై వ్యవసాయ, మార్కెటింగ్, రోడ్లు-భవనాలు, పంచాయితీ రాజ్ శాఖాధికారులతో ఇంతియాజ్ అహ్మద్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారితో కలసి కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షించారు. అకాల వర్షాల కారణంగా 7,965.5 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలకు, 40 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా


మాట్లాడుతున్న ఇంతియాజ్ అహ్మద్, కలెక్టర్ తదితరులు

వేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు వివరించారు. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు, రబీలో సాగు చేస్తున్న పంటలకు పంటల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. జిఒ 66, 67 ప్రకారం పంటల బీమా వర్తిస్తుందని, ఇన్‌పుట్ సబ్సిడి అందిస్తుందని చెప్పారు. జిల్లాలో 170 ఆర్‌బికెల ద్వారా మొక్కజొన్న కొనుగోలు ఇప్పటికే ప్రారంభమైందని, రైతులు అధైర్యపడవద్దని తెలియజేయడంతో పాటు, వర్షం తగ్గిన తరువాత వాస్తవిక పంట నష్టం అంచనాను రూపొందించి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఈ అంశాలను రైతులకు వివరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది ఇదే నెలలో 10 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవగా ఈ ఏడాది 100 మిల్లీ మీటర్లు నమోదైనట్లు తెలిపారు. కొన్ని మండలాలో 170-175 మిల్లీ మీటర్ల వరకు వర్షాలు పడ్డాయన్నారు. పంట నష్టం అంచనాలు తయారీకి బృందాలను సిద్ధం చేశామన్నారు. ఉద్యాన పంటలైన అరటి, మిర్చి పంటలపై, కళ్లాల్లో, పొలాల్లో వున్న, దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి పంటలపైనా సమీక్షించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తుళ్లూరు


మండల పరిధిలోని పెద్ద పరిమి సెయింట్ మేరీ హైస్కూల్ ఆవరణలో 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం పాఠశాల పూర్వ విద్యార్థి నల్లపు కిషోర్ బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. 27 ఏళ్ల అనంతరం జరిగిన ఈ కార్యక్రమానికి ఆనాటి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు హాజరై, విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు.పూర్వ విద్యార్థులు అనాటి స్కూల్ జ్ఞాపకాలను,అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దౌపాటి జోజియ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి ఉత్తమ క్రమశిక్షణతో మెలగాలని,అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శనరావు,స్లేవరాజు, వైబి రాజేశ్వరరావు, దుర్గాప్రసాద్,వై భాస్కర్ రెడ్డి,కుసుమ కుమారి,పి లూర్ధు,సవరయ్య,కె ఉమామహేశ్వరరావు, వినయ్ కుమారి,బాల శౌరీలు,సెయింట్ మేరీస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుని నిర్మల,మర్రయ్య పాల్గొన్నారు.

పేదలపై ప్రేమంటే ఇళ్లు కూల్చడమా..?

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడేపల్లి ప్యాలెస్ ముందు ఉన్న పేదల ఇళ్లను కూల్చిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదలపై ప్రేమ అంటూ కపట నాటకాలాడుతున్నారని అమరావతి దళిత జెఎసి నాయకులు పులి చిన్నా మండిపడ్డారు. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు చేస్తున్న ఆందోళనలు ఆదివారంతో 1232వ రోజుకు చేరాయి. మందడం, వెంకటపాలెం, తుళ్లూరు, వెలగపూడి, నెక్కల్లు తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు సాగాయి. అసైన్డ్ రైతు పులి చిన్నా మరికొందరు మాట్లాడుతూ సొంత అవసరాల కోసం ఇంటి ముందు ఉన్న పేదలను తరిమికొట్టిన ఘనుడు జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. రాజధానిలో ఉన్న 5,034 టిడ్కో ఇళ్లను పేదలకు అప్పగించలేకపోయినందుకు వైసిపి ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు 54 వేల మందిని వేర్వేరు జిల్లాల నుంచి తీసుకొచ్చి రాజధానిలో ఇళ్ల స్థలాలను కేటాయించి రైతులపై దాడులు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి పరిధిలో ఉన్న నిజమైన పేదలకు ఇప్పటికే ఉన్న ఆర్3 జోన్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తే తాము స్వాగతిస్తామని తెలిపారు. ఇతర జిల్లాల వారికి ఆర్5 జోన్ లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం సరికాదన్నారు. ఎన్ని కుట్రలు చేసినా న్యాయం స్థానంలో విజయం రైతులు, రైతు కూలీలదేనన్నారు.


మాట్లాడుతున్న దళిత జెఎసి నాయకులు పులి చిన్నా


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

తామ్రతమంతా అధికారం కోసమేనని విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారంపై మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి నష్టం అంచనా వేస్తున్నామని చెప్పారు. పంట నష్టం వాటిల్లిన ఏడాదిలోనే తమ ప్రభుత్వం పరిహారం అందిస్తోందని, టిడిపి హయాంలో రైతులకు నష్టపరిహారం చెల్లించకుంటే వైసిపి హయాంలో చెల్లించామని అన్నారు. ఏప్రిల్ నెల చివరి, మే నెల మొదటి వారంలో అకాల వర్షాల వల్ల పల్నాడు జిల్లాలో 1055 ఎకరాల్లో కోత మీద ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, 2500 క్వింటాళ్ల ఆరబోసిన ధాన్యం తడిసినట్లు రైతుల నుంచి సమాచారం సేకరించామని తెలిపారు. 19.5 ఎకరాల్లో మిర్చి, అరటి, పుచ్చ ఇతర వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి పంట నష్టం అంచనాలను తయారు చేసి, ప్రభుత్వానికి పంపించి రైతులను ఆదుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఉద్యాన శాఖాధికారి బెన్నీ, ఇన్‌ఛార్జి ఎడిఎ శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు ఆర్.పురుషోత్తమరావు, కె.విజయభాస్కర్‌రెడ్డి, అచ్యుత శివప్రసాద్, ఎం.ప్రవీణ్‌రెడ్డి, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ శివన్నారాయణ పాల్గొన్నారు.

మ్యాజిక్ నేర్చుకుందాం రండి

ప్రజాశక్తి-తాడేపల్లి



మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్లో జరుగుతున్న మ్యాజిక్ నేర్చుకుందాం రండి ఉత్సాహంగా జరుగుతుంది. మొదటి రోజు నుంచి హాజరైన పిల్లలు అదే ఒరవడితో హాజరు శాతం తగ్గకుండా కొనసాగుతుంది. మేజిషియన్, విశ్రాంత ఎంపిడిఒ కె.ఆదినారాయణ మండుతున్న కర్పూరాన్ని నోటోల వేసుకుని మింగేశారు. శిక్షనకు వచ్చిన పిల్లలు ఒక్కసారిగా ఆశ్చర్యంతో నోళ్లు వెల్లబెట్టారు. తాను పూర్తిగా నేర్పించేంత వరకు చేయవద్దని పిల్లలకు సూచించారు. ప్రపంచ ఇంద్రజాలికులు క్రాంతికార్ రిబ్బన్ చూపించి అందులోంచి గులాబి పువ్వును తెప్పించారు. ఈ ప్రయోగంతో అనేక రకాల ప్రయోగాలు ఆయన ఆదివారం పిల్లలతో చేసి చూపించారు. మధ్యమధ్యలో పిల్లలకు ఆదినారాయణ మ్యాజిక్‌లో నీతికథలను చెప్పి ఉత్సాహపరిచారు. మూఢనమ్మకాలు ఎలా ఉంటాయో చెప్పి పిల్లలను చైతన్యపరిచారు. ఆదివారం జరిగిన శిక్షణలో బుల్లితెర యాంకర్ సుడిగాలి సుధీర్ మేనమామ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ రవీంద్రబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ 27 ఏళ్లప్పుడే దేశం కోసం ప్రాణాలు విడిచిన గొప్ప వీరుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన మార్గంలో నేటి యువత పయనించాలని కోరారు. స్వాతంత్రోద్యమంలో ఎలాంటి పాత్రలేని ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి నేడు దేశాన్ని పరిపాలిస్తున్నాయని, ప్రజలను కష్టాలు పెడుతున్న ఈ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో త్యాగరాజు, శాంతి, భవాని, అనిల్, లతశ్రీ పాల్గొన్నారు.

ఆకతాయిల వేధింపులపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

యువతిని ఆకతాయిలు వేధించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐతానగర్ కు చెందిన యువతి శనివారం రాత్రి కాలినడకన ఇంటికి వెళుతుండగా కొందరు యువకులు ఆమెను టీజ్ చేశారు. యువతి ఎదురు తిరిగి ప్రశ్నించడంతో ఆమెపై దాడి చేశారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఆదివారం కేసు నమోదు చేశారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి మళ్లీ అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెం గ్రామానికి చెందిన ఒక యువతి పట్ల దామర్ల చిరంజీవి గతంలో చెడుగా ప్రవర్తించి, వేధించాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అతను రిమాండ్ నుండి వచ్చిన పిదప కూడా సదరు యువతి వెంట పడుతూ బెదిరిస్తున్నాడు. ఈనెల 3న యువతి వివాహ నిశ్చయ కార్యక్రమాన్ని కూడా అడ్డుకునే విధంగా ప్రవర్తించడంతో దామర్ల చిరంజీవిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా అతనికి న్యాయమూర్తి మరో సారి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మహిళలపై ఎవరైనా చెడుగా ప్రవర్తించినా, దురుసుగా వ్యవహరించినా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


దామర్ల చిరంజీవి

భారీ వర్షానికి కూలిన గుడిసె

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం,ఈదురు గాలులకు పూరి గుడిసె కుప్పకూలింది.ముడావత్ మంగ్తా నాయక్ బ్రహ్మానందపురం తండా సమీపంలో తన పొలంలోనే పూరి గుడిసె నిర్మించుకొని గత 10 ఏళ్లుగా నివాసం సాగిస్తున్నాడు.శనివారం అకస్మాత్తుగా వర్షం, ఈదురు గాలుల ధాటికి పూరి గుడిసె ఒక్కసారిగా కుప్పకూలింది.దీనితో గుడిసె లో ఉన్న మంగ్తా నాయక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.వర్షం వస్తుండటంతో తన గుడిసెలోనే కట్టేసిన రెండు ఎద్దులకు కూడా స్వల్పంగా గాయాలయ్యాయి.పూరి గుడిసెలో ఫర్నిచర్ ధ్వంసం అయి సుమారు 50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని మంగ్తా నాయక్ తెలిపారు.

అభివృద్ధి కుంటుపడింది: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి అధికారం చేపట్టాక నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. మండలంలోని అర్వపల్లి, కాకాని గ్రామాలలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రచ్చబండ పేరుతో ఆయా గ్రామాలలో పర్యటించి నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై కాకుండా కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే నరసరావుపేట ను ఎడ్యుకేషన్ హబ్ గా అభివృద్ధి చేస్తామన్నారు.గ్రామంలో రైతులు ఏయే పంటలు సాగు చేశారు, ఎంత మేర నష్టం వాటిల్లింది అనే అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వైసిపి హయాంలో రైతులు మద్దతు ధరలు దక్కక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



రైలు నుండి పడి యువకునికి గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైల్లో నుంచి జారిపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి అచ్చెంపేట రైల్వే గేటు సమీపంలో వేగంగా వెళుతున్న రైల్లో నుంచి యువకుడు జారిడ్డాడు ఈ ప్రమాదంలో హైదరాబాద్ బండ్లగూడకు చెందిన షేక్ అబ్దుల్ మజీబ్ తీవ్రంగా గాయపడ్డాడు. హౌరా నుండి సికింద్రాబాద్ వెళుతున్న పలక్ నామ ఎక్స్ప్రెస్ రైలు నుండి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు.క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమడ వాగులో మృతదేహం

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు నల్లమడవాగులో గుంటూరు నుండి చేపలు పట్టడానికి వచ్చి వాగులో గల్లంతైన కె.ఈశ్వర్ మృతదేహాన్ని ఆదివారం ఎన్డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లువెలికి తీశారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ అబ్దుల్ రహమాన్ తెలిపారు.

మద్యం సేవిస్తున్న యువకుల అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న యువకులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాల ప్రకారం బుర్రిపాలెం రోడ్డులో 8 మంది యువకులు మద్యం సేవింస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని కోర్టులో సోమవారం హాజరు పరుస్తామని చెప్పారు.



మార్కెట్ యార్డు ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కు ఇటీవల నూతన ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన బత్తుల రామకృష్ణను బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమం లో బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపా ధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, వైస్ ఎంపిపి తన్నీరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కాంప్రహెన్సివ్ అబార్షన్ కేర్‌పై శిక్షణ

ప్రజాశక్తి-నరసరావుపేట

కాంప్రహెన్సివ్ అబార్షన్ కేర్‌పై పల్నాడు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి గుంటూరు జి.జి.హెచ్ లో ఈ నెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు 3 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందిస్తున్న 3 వైద్య బృందాలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఆయా బందాలకు ఈ నెల 13 లోగా శిక్షణ ఉంటుందని చెప్పారు. జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి డాక్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో జి.జి.హెచ్ సుపెరినెంట్ డాక్టర్ ప్రభావతి పర్యవేక్షణలో ప్రొఫెసర్లు డాక్టర్ జయంతి (హెచ్.ఓ.డి) , డాక్టర్ షర్మిళ, డాక్టర్ రజని కుమారి,డాక్టర్ ఝాన్సీ వాణి మరియు జిజిహెచ్ ప్రసూతి వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తారని అన్నారు. శిక్షణ లో నేర్చుకున్న అంశాలను వైద్య బృందం సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

నష్టపరిహారం చెల్లించకపోతే ముట్టడి

ప్రజాశక్తి-నరసరావుపేట

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులకు న్యాయం చేయాలని , పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం తక్షణమే అందేలాగా చర్యలు తీసుకోవాలని సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జొన్నలగడ్డలో ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రాంబాబు మాట్లాడుతూ రైతులకు నష్ట పరిహారం చెల్లింపు విషయంలో నిర్లక్ష్యం చేస్తే రైతులను సమీకరించి ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ సిపిఐ సహాయ కార్యదర్శి వైదన వెంకట్, నాయకులు ఆనంద్ ముసలయ్య యాకోబు బాబు రాజు రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చిలుకా చంద్రశేఖర్

ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వందేళ్ల క్రితమే కుల వివక్షత, మనువాదం, బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాలకు ఊపిరి పోసిన పెరియార్ స్ఫూర్తి నేటి పరిస్థితులకు సజీవమని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అన్నారు. సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పెరియార్ పరిచయ సభ లో చిలుకా చంద్ర శేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కవి, పాత్రికేయుడు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో తిరిగి మనువాద ఆలోచనలు పురుడు పోసుకుంటున్నాయని వివరించారు. పెరియార్ స్ఫూర్తితో సంఘటితంగా దీన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మనువాదం నుంచి ప్రజాస్వామ్యవాదాన్ని బ్రతికించుకోవాలన్నారు. సామాజిక సమస్యల స్పందించేవారని, హిందూ వ్యవస్థల మూఢాచారాల పై తిరుగుబాటు చేశారని వివరించారు.మార్పు అనేది తన కుటుంభం నుంచే ప్రారంభించి సమాజంలో మార్పు వచ్చే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. పెరియార్ రీడర్ పుస్తకాన్ని తెలుగులో అనువదించామని దీన్ని పాఠకులు చదవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీం, బత్తుల శ్రీనివాస బాబు, వై.వెంకటేశ్వరరావు పెరియార్ జీవిత చరిత్ర గురించి వివరించారు. ప్రముఖ చిత్రకారుడు జింక రామారావును సత్కరించారు.

బిజెపి దోపిడి విధానాలకు వ్యతిరేకంగా పోరాడదాం

ప్రజాశక్తి-గుంటూరు :బిజెపి దోపిడి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ,ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా గుంటూరు నాజ్ సెంటర్ లో గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంర్భంఘగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు. గనిరాజు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్.కష్ణ మాట్లాడుతూ మన దేశాన్ని 200ఏళ్ల పాటు దోపిడీ చేసిన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాడు అనేక పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్,జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.పోతురాజు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు గంధం శ్రీను, సాయి వరప్రసాద్, మాజేటి శేఖర్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరమునకు ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆసక్తి కల విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఈనెల తొమ్మిదో తేదీ నుండి 25వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉంటుందన్నారు.



వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-దాచేపల్లి

వైసిపి నరసరావు పేట పార్లమెంటరీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మందపాటి రమేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. దాచేపల్లి మండలం కేసనపల్లి గ్రామంలో వైసిపి మాజీ గ్రామ కన్వీనర్ నాగులు మీరా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాగుల మీరా మాట్లాడారు. స్థానిక వృద్ధాశ్రమంలో వద్ధుల పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోమిన్ బ్రదర్స్ అండ్ కో బీసీ సెల్ అధ్యక్షులు భీమవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు

మొక్కజొన్న పంటకు మొలకలు!



అకాల వర్షాలతో పెదకూరపాడు మండలంలో రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-పెదకూరపాడు



వారం రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు మొక్కజొన్నలో మొలకలు వచ్చే పరిస్థితి నెలకొంది. మండలంలో రబీ సీజన్‌లో మొక్కజొన్న 550 ఎకరాలలో సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. కొంత మొక్కజొన్న వేసిన పొలము కోతకు సిద్ధంగా ఉంది. కానీ ఈ వర్షాలతో కోయడానికి అవకాశం లేక రైతులు నిలుపుదల చేశారు. గాలి కూడా వీస్తుండటంతో మొక్కజొన్న పైరు కొన్ని చోట్ల నేలకు ఒరిగింది. ఈ క్రమంలో నేలకు ఒరిగిన మొక్కజొన్న కండెల నుంచి మొలకలు కూడా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు వర్షానికి తడవడంతో గింజ నాని, రంగు మారింది. తూకం కూడా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరను వ్యాపారులు కుమ్మక్కై తగ్గించారని సమాచారం. వర్షం పేరిట ధర మరింతగా తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి తర్వాత మొక్కజొన్న సాగు..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి సాగు చేశారు. సెప్టెంబర్ లో భారీ వర్షాలు కురిశాయి. అప్పుడు పూత, గూడ పింద రాలిపోయాయి. మళ్లీ కాపు వచ్చినది. గులాబి రంగు పురుగు దాడి చేసింది. దీంతో రైతులు పత్తిని పీకి వేశారు. మొక్కజొన్న ధర ఆశాజనకంగా ఉండటంతో దానిని సాగు చేశారు.ప్రారంభ సమయంలో మొక్కజొన్న క్వింటా ధర రూ.2500 చూసిన రైతులు, ఇప్పుడు క్వింటా రూ. 1700 కు అమ్ముకునేందుకు ఆసక్తి చూపడం లేదు. సమీపంలోని శీతల గోదాములు అందుబాటులో ఉన్నవారు నిల్వ చేయడానికి మొగ్గుచూపుతున్నారు.

తిరోగమనంలో ధరలు

కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ.1962గా కనీస మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం రైతులకు ఆ ధర కూడా లభించని పరిస్థితి నెలకొంది. గత అక్టోబరు ఉంచి జనవరి వరకు మొక్కజొన్న క్వింటా రూ.2500 ధర పలికింది. పంట చేతికి వచ్చిన తర్వాత క్రమంగా ఆ ధర పతనమవుతూ వచ్చింది. మార్కెట్లో సరకు లభ్యత పెరుగుతుండటంతో ధరలు మరింత తగ్గాయి. పల్నాడు ప్రాంతంలో గత 30 రోజుల నుంచి ముమ్మరంగా నూర్పిడులు జరుగుతున్నాయి. ఏప్రిల్ తొలి వారంలో రూ.2,300 వరకు కొనుగోళ్లు జరగగా, ప్రస్తుతం రూ.1700కు దిగజారింది. మార్కెట్లో సరకు లభ్యత ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు ఆచి తూచి కొనుగోళ్లు చేస్తున్నారు.

ఆర్‌బికె ద్వారా కొనుగోలు చేయండి

మొక్కజొన్నను ఆర్.బి.కె ద్వారా కొనుగోలు చేయాలని, పెదకూరపాడు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు ఆవుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కావడం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నను రూ 1700-1650 లకి అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, స్పందించకపోతే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పేర్లు నమోదు చేసుకోండి

మొక్కజొన్న పంట వేసిన రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని పెదకూరపాడు మండల వ్యవసాయ శాఖాధికారి శాంతి కోరారు. నమోదు చేసుకున్న వారి పంటను ప్రభుత్వం ప్రకటించిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.

ప్రతిభచాటిన పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి-నరసరావుపేట



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఐఎఫ్‌ఎస్ ప్రసాద్

నవోదయం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధి కారి జూపూడి ప్రసాద్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటిని విశ్రాంత ఐఎఫ్ఎస్ జూపూడి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థినీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.1 లక్ష చెక్కును కలె క్టర్‌కు ఆయన అందజేశారు. నవోదయంలో విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, యువ సాధికారిత కార్యక్రమాలను రూపొం దించి, అందుకు అనుగుణంగా ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతికి కలెక్టర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రసాద్ కొనియాడారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం మరి కొంత మంది సహకారం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జూపూడి కుటుంబ సభ్యులు ప్రకాష్, నాగమ్మ, డేవిడ్ పాల్గొన్నారు.



మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు


కట్టావారిపాలెంలో బొడ్రాయి ప్రతిష్ఠ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని కట్టావారిపాలెంలో ఆదివారం బొడ్రాయి (నాభి శిల)ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. ఈ మహోత్సవం లో మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు పాల్గొన్నారు . అనంతరం గ్రామంలోని పోలేరమ్మ తల్లి, అంకమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల సాంబయ్య,మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు, గ్రామ నాయకులు బండారు పల్లి నరసింహారావు,కొబ్బరి సుబ్బారావు, నువ్వుల రాంబాబు, కొయ్య నరసింహారావు, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు దంతవైద్య సేవలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పోసాని ప్రసన్న కుమార్

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందవచ్చు అని డాక్టర్ పోసాని ప్రసన్నకుమార్ అన్నారు. సత్తెనపల్లి ఎన్జీవో హోం సెంటర్ లోని రవి తేజస్వి దంత వైద్యశాలలో అందరికీ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు ప్రసన్న కుమార్ చెప్పారు. దంతాలను అమర్చడం, అప్పటికప్పుడే ఎక్సరే ద్వారా ఒకే సిట్టింగ్ లో రూట్ కెనాల్ చికిత్స, ఎత్తు, వంకర పళ్ళు, సరిచేయడం కోసం అత్యాధునికమైన పద్ధతిలో క్లిప్స్ ట్రీట్మెంట్ అందుబాటులోకి రానుందని అన్నారు. సోమవారం నుండి ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీమ్ ఉద్యోగులకు దంతాలకు సం బంధించి అన్ని రకాల సేవలు ప్రారంభించనుననట్లు చెప్పా రు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ కారు ఉన్న ప్రతి ఒక్క విలేకరికి వైద్యము చేస్తామని, సామాన్య ప్రజలకు అత్యాధునిక సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. యువతకు సమ స్యగా ఉన్న పంటి వరుసలను సరిచేసే 'స్మైల్ డిజైనింగ్' తో చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు.

డిగ్రీ మొదటి సెమ్ ఫలితాల్లో కృష్ణవేణి విజయభేరి

- వర్సిటీ ప్రథమ ర్యాంక్
- పల్నాడు జిల్లాలో మొదటి స్థానం

ప్రజాశక్తి-నరసరావుపేట



కె.వెంకటలక్ష్మి



ఎస్‌డి మంసురున్నీసా



షేక్ షభనమర

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన బి.ఎస్.సి , బి.కాం (కంప్యూటర్స్) మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపులలో మంచి మార్కులు సాధించి యూనివర్శిటీలోనే ప్రథమ ర్యాంక్ సాధించి, పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కె.వెంకటలక్ష్మి 700 మార్కులకు గాను 692, ఎస్.డి మంసురున్నీసా 690, షేక్ షభనమర 689 లతో పాటు మరో విద్యార్థిని బి.మౌనదీపిక 750 మార్కులకు గాను 703 సాధించారని పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు యూనివర్సిటీ లోనే టాప్ ర్యాంక్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.ఆర్.కె సతీష్ బాబు,టిపిఓ ఎం.బాలకోటేశ్వరరావు, సిబ్బంది షేక్.సర్దార్, ఎం. తిరుపతిరావు అభినందించారు. తమ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు బోధిస్తారని, క్రమశిక్షణ, ఆట పాటలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.ఇటీవల పలు బహుళ జాతి కంపెనీలు నిర్వ హించిన ప్రాంగణ ఎంపికలలో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించి ఉన్నత సానాల్లో ఉన్నట్లు తెలిపారు.



తుమ్మలచెరువు పంచాయతి కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలం తుమ్మలచెరువు గ్రామపంచాయతి వర్కర్ల జీతాల సమస్య పరిష్కరించాలని కోరుతూ మూడోరోజు ఆదివారం సమ్మె శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు వచ్చేంత వరకు దశల వారీగా ఆం దోళన చేపడతామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పెరగార్లపాడు భవ ననిర్మాణ కార్మిక సంఘం నాయకులు హాజరై మద్దతు తెలిపారు. భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు పి.కృష్ణ, టెంటు సైదా, పంచాయతి కార్మికులు జి.సుందరావు, బి.రాజేష్, సుందరావు,టి.సల్మాన్,సామేలు పాల్గొన్నారు.

వారథి ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- దాచేపల్లి



బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న 'వారథి' వ్యవస్థాపకులు టి.ఆనంద్, తదితరులు

మండలంలోని కాట్రపాడు గ్రామానికి చెందిన అల్లగడ్డ పుల్లంరాజుకు కళ్ళు కనిపించకపోగా షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పుల్లంరాజు, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌తోనే జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ప్రతినెల అతనికి మందుల నిమిత్తం రూ. 3,000 వరకు ఖర్చు అవుతుంది. ఈ విషయం తెలుసుకున్న వారథి ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి.ఆనంద్ మాస్టర్, పుల్లంరాజు కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు, వచ్చే ఐదు నెలల వరకు మందుల ఖర్చు కోసం ఆర్థిక సాయం కింద రూ. 21,000 అంద జేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వారధి ఫౌండేషన్ ద్వారా ఆనంద్ మాస్టర్ చేస్తున్న సేవా కార్య క్రమాలు అభినందనీయమని ప్రశంసిం చారు. 80 మం దితో నడుస్తున్న వారధి ఫౌండేషన్ మరింత మం దికి సాయం చేసే సంస్థగా ఎదగాలని ఆకాంక్షిం చారు. ఈ నెల నుండి తాను కూడా వారధి ఫౌం డేషన్ లో సభ్యుడిగా కొనసాగుతానని, ప్రతినెలా తన వంతు సాయం చేస్తానని అన్నారు. కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఇ.రాజు, జి. భాస్కర్, ఎస్‌కె నాగుల్ మీరా, వారధి ఫౌండేషన్ సభ్యులు కె.మరియదాసు, మాజీ సర్పంచ్ ఆర్ఎం రాజు, గ్రామ కమిటీ సభ్యులు జి. ప్రభాకర్ రాజు, జివి రాజు పాల్గొన్నారు.


కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు,నాయకులు


బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు,నాయకులు

పేదల ఇళ్ల కూల్చివేత అన్యాయం

- రోడ్డు విస్తరణ సాకుతో అధికారుల దుశ్చర్య
- ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తే ఉద్యమం
- ఆత్మకూరులో బాధితులను పరామర్శించిన సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరులో 40 సంవత్సరాలు నుండి ఇళ్లేసుకుని జీవిస్తున్న 140 పేదల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో కూల్చి వేయడం దారుణమని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు తీవ్రంగా ఖండించారు. ఆత్మకూరు వడ్డెర కాలనీలో ఇళ్లు కోల్పోయిన బాధితులను వారు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు సమాచారం గానీ నోటీసులు కానీ ఇవ్వకుండా ఇళ్లను కూల్చడం అక్రమమని, కనీసం ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా అక్కడున్న ఇళ్లను తొలగించడం ఏమిటని మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు వెడల్పుగానే ఉందని, గుంతల మయంగా ఉన్న రోడ్డును మరమ్మతు చేయకుండా విస్తరణ సాకుతో ఆత్మకూరు సెంటర్ నుండి బైపాస్ రోడ్డు వరకు ఉన్న పేదల ఇళ్లను తొలగించడం అన్యాయమని విమర్శించారు.ప్రత్యామ్నాయ స్థలాలు చూపి ఇళ్లను నిర్మించాకే రోడ్డు వెడల్పు చేస్తామని ఎమ్మెల్యే గతేడాది వాగ్దానం చేశారని, నేడు దాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 10 వేల కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారు పట్టాల కోసం దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడంలేదని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయాలు చూపకుండా ఇళ్లు తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అభివృద్ధి అంటే రోడ్డు వెడల్పు ఒక్కటే కాదని, ప్రజల జీవితాలనూ మెరుగుపరచాలని హితవు పలికారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.దుర్గారావు, పి.ప్రసాద్, సిహెచ్.సీతారామాంజనేయులు, బి.రాంబాబు, జనార్ధనరావు, వి.రామారావు, పద్మనాభశర్మ, బాబ్జి, సుబ్రహ్మణ్యం, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మువ్వా చినబాపిరెడ్డి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తుళ్లూరు

పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడంతోపాటు రెండు దశాబ్దాలకు పైగా సాహిత్య కార్యక్రమాల ద్వారా విలువలతో కూడిన సమాజం కోసం కృషి చేస్తున్న 'మువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు' సేవలు అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు.ఆదివారం స్థానిక పెదపరిమి మువ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు భవనం వృద్ధాలయంలో 'సహస్ర కథా స్రవంతి' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వెయ్యి రోజులకు



మాట్లాడుతున్న డాక్టర్ పాపినేని శివశంకర్

పైగా ప్రతి రోజు వేకువజామునే వాట్సప్ కథనం జనరంజకంగా సాహితీ పిపాసుల ఆకలి తీర్చే విధంగా ప్రసారం చేయటం అరుదైన సాహితీ సేవగా అభివర్ణించారు. ప్రముఖ నాటక రంగ రచయిత వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాలాల ద్వారా వికతాలు సమాజాన్ని ముంచెత్తుతున్న నేపథ్యంలో కథా స్రవంతులు సమాజానికి దారి చూపే దివిటీల వంటివన్నారు. సభకు అధ్యక్షత వహించిన ట్రస్టు చైర్మన్ ఎంవి రామిరెడ్డి మాట్లాడుతూ,'కథా స్రవంతి శ్రవణార్చన' ధారావాహికంగా పదివేలకు పైగా ప్రసారం చేసేందుకు సంకల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా కథా స్రవంతి నిర్వాహకులు ములగాడ సురేష్ కుమార్,స్వర ప్రధా త పప్పు జోగారావు, సాంకేతిక సహకారం అందించిన పప్పు వరుణ్, దాసరి రవళిలను డాక్టర్ పాపినేని శివ శంకర్, ఎం.వి రామిరెడ్డి, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపకాలు అందజేశారు.హాజరైన ప్రతి ఒక్క కథా రచయితకు కథల పుస్తకాల సంచులను, జ్ఞాపికలను బహుకరించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, వంగా సాంబిరెడ్డి,మువ్వా సాంబిరెడ్డి,ట్రస్టు సభ్యులు,గ్రామ పెద్దలు,పాల్గొన్నారు.


దుగ్గిరాలలో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న నాయకులు


తెనాలిరూరల్ గ్రామాల్లో పంటపొలాలను పరిశీలిస్తున ఆలపాటి

నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోండి..

ప్రజాశక్తి - దుగ్గిరాల: అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మంచికలపూడి, పెనుమూలి, కంఠంరాజు, కొండూరు గ్రామాలలో ఆదివారం పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలకు రోజుల తరబడి తడవడం వలన మొక్కజొన్న రంగు మారుతున్నదని, కొన్నిచోట్ల మొక్కలు మొలిచాయని కండెలు తిప్పి ఆరబెట్టడం వలన ఎకరాకు రూ.6000లు అదనంగా కూలి అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.1500 రూపాయలకు అడుగుతున్నారని రైతులు తెలిపారు. కండేలు బూజు పడుతున్నాయని ఎకరాకు 25 నుండి 50 వేల వరకు నష్టం వాటిల్లవచ్చునని వారు తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరావు, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి యం. నాగమల్లేశ్వరావు, రైతు సంఘం నాయకులు వి. సాంబశివరావు, బి. అమ్మిరెడ్డి రైతులు వై. బంగారుబాబు, గోపి. టి. మురళీక్రిష్ణ మహేష్ పాల్గొన్నారు.

తెనాలి: అకాల వర్షాలతో చేతికందిన పంట నేలపాలైందని, కనీసం నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించే తీరిక కూడా ప్రభుత్వానికి లేదా అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. రూరల్ గ్రామాలు కఠెవరం, ఐతానగర్ గ్రామాలలో ఆయన ఆదివారం పర్యటించారు. పెట్టుబడి, నష్టం వివరాలను తెలుసుకున్నారు. అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని పంట నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తేనే పంటనష్టం అంచనా వస్తుందన్నారు. కానీ ఇప్పటికి కూడా అధికార గణం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఇ. పూర్ణచంద్, వంగ సాంబిరెడ్డి, ఈదర వెంకట పూర్ణచంద్, గుమ్మడి ప్రసాద్, కే శ్రీనివాసరావు తదితరులున్నారు.


ఎర్రగుంట్లపాలెంలో తాలుగాయాలుగా మారుతున్న చెట్లకు ఉన్న మిరపకాయ

మంగళగిరి: 66 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేయాలనటం రైతులను మోసగించడమే అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదేపదే అధిక వర్షాలు, అకాల వర్షాల వల్ల మిర్చి మొక్కజొన్న ,పసుపు, మామిడి ఇతర వాణిజ్య ఆహార పంటలు త్రీవంగా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత మార్చిలో 23 వేల హెక్టార్లో పంట నష్టపోయి ఉంటే ఇప్పటికీ కూడా నష్టపరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత వర్షాలకు పంట నష్టపోయిన రైతులుకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. ఈశ్వరరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఫిరంగిపురం: ఇటీవల కురిసిన వర్షాలకు కష్టపడి పండించిన పంట తడిసి ముద్దయి పోయిందని, పంట పోలాల్లోని చెట్టమీద మిరపకాయాలు రాలి తాలుగాయాలుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ అధికారి పంట నష్టాన్ని అంచనా వేయలేదని, కనీసం రైతులను కలిసిన పాపాన పోలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పంట నష్ట పరిహారాన్ని అందించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి చల్లండి

ప్రజాశక్తి-పెదకాకాని: తడిచిన మొక్కజొన్న పంటలో లీటర్ నీటిలో 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేసుకోవాలని మండల వ్యవసాయాదికారి సంధ్యారాణి సూచించారు. ఆదివారం దెబ్బతిన్న పంటను పరిశీలించి మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా మండలంలో కురిసిన వర్షానికి మండల పరిధిలో కోత కోయని జొన్న 500ఎకరాల్లోనూ, కోసి కల్లాలలో ఆరబెట్టిన జొన్న 150ఎకరాలలోనూ ఉందని అంచనా వేశారు. అలాగే మొక్కజొన్న 200ఎకరాలలో పంట తడిసిందని, అరబెట్టిన పైరు పై ఉప్పు కలిపి పిచికారీ చేయడంవల్ల రంగుమారదని సూచించారు. ఎన్ని ఎకరాలలో పంట నష్టం వచ్చిందనే నివేదికని త్వరలోనే ప్రభుత్వానికి పంపిస్తామని తెలియజేసారు.


యాకోబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాశం రామారావు, నాయకులు

యాకోబు స్ఫూర్తితో పని చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

పేదలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మరింతగా పోరాడటమే చప్పిడి యాకోబుకు అర్పించే నిజమైన నివాళి అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు నివాళులర్పించారు. యాకోబు వర్ధంతి సభ ఆదివారం రాత్రి తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా యాకోబు చిత్రపటానికి వేముల దుర్గారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా రామారావు మాట్లాడుతున్న పేదలు ఎక్కువగా నివశిస్తున్న క్రిష్టియన్ పేట ప్రాంతంలో యాకోబు పేదల కోసం నిరంతరం పని చేశారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యునిగా కూలీ రేట్ల పెంపుదల కోసం, కనీస వేతనాల కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారని చెప్పారు. దేశంలో బిజెపి పరిపాలిస్తున్న తీరుపై ఆయన తీవ్రంగా స్పందించారు. అన్ని రంగాల్లో బిజెపి విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా దేశ ప్రతిష్టతను ఇనుమడింపజేసిన రెజ్లర్ల ఆందోళనలపై పోలీసులతో దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. న్యాయమైన వారి డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి పోలీసు బలగాలను ఉపయోగించడం పిరికిపంద చర్య అన్నారు. పూల్వామా కేసులో తన అధికారం నిలబెట్టుకోవడానికి 30 మంది సైనికుల ప్రాణాలను ఫణంగా పెట్టిన బిజెపి ప్రభుత్వం ఒక క్షణం కూడా దేశంలో అధికారంలో ఉండటానికి వీల్లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి కొట్టె కరుణాకరరావు, పి.గిరిజ, సోలా ముత్యాలరావు, ఎల్.ఆచారి పాల్గొన్నారు.

నేడు మొసలి శివమ్మ సంస్మరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు మొసలి పకీరయ్య భార్య శివమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంస్మరణ కార్యక్రమాన్ని మంగళగిరి - పెదవడ్లపూడిలో రోడ్డులోని కోకోకోలా కంపెనీ వద్ద 'వై గార్డెన్' ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.


సౌజన్య అమరాచారి, శిరీష లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గాయని సౌజన్యకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సినీ మాటలు రచయత బుర్రా సాయి మాధవ్ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శక పురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని కత్తి సౌజన్యను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వక్తలు అమరాచారి, ముత్తె శిరీష లు ఎన్టీఆర్ పాలన పై ఎన్టీఆర్ సినిమాలు అనేఅంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, చెరుకుపల్లి సింగరావు దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, డి.భాస్కర్, నన్నే సాహెబ్, పి.సురేష్, జి. రాంబాబు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

టిడ్కో ఇళ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ

అధికారులతో సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఇక మీదట టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకూ నిరంతరం పర్యవేక్షిం చాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ ఆదేశించారు. పనుల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం సమీక్షించారు. అధి కారులు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజక వర్గం పరిధిలో మొదటి దశగా 4512 ఇళ్లు పూర్తవ్వాల్సి ఉండగా 4 వుల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదార్లకు అందించామని, మరో 512 ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. నరసరావుపేట పట్టణ పరిధిలో 1504 ఇళ్ల పనులను ఈనెల 15 నాటికి పూర్తి చేసి లబ్ధిదార్లకు త్వరలో అందిస్తామన్నారు. మాచర్ల పట్ట ణంలో 1057 ఇళ్లకుగాను 984 ఇళ్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పిడుగురాళ్ల పట్టణ పరిధిలో 2832 గృహాలకు గాను 1296 గృహాలను తొలి దశలో సిద్ధం చేస్తున్నామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో సుమారు 160 గృహాల నిర్మాణం కొనసాగనున్నట్లు చెప్పారు. అధికారుల వివరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మా ణాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కాంట్రాక్టర్లతో సమస్యలున్నచోట స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలతో చర్చించా లన్నారు. సమావేశంలో 3 జిల్లాల టిడ్కో గృహ నిర్మాణ ఇఇ ఎ.ప్రసాదరావు, డిఆర్‌ఒ వినాయకం, గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ వేణుగోపాలరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో కలెక్టర్ శివశంకర్



అల్లూరి సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మండలంలోని బొప్పూడిలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ అప్పాపురం రమేష్, వైసిపి గ్రామ అధ్యక్షులు నేరు బుడే, మాజీ ఎంపి టిసి మస్తాన్ వలి పాల్గొన్నారు. **యడ్లపాడు:** శాఖా గ్రంథాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో సీతారామరాజు చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గ్రంథాలయం అధి కారి సిహెచ్ అంజమ్మ, వై.సంజీవ రావు, బి.తేలేజమ్మ, బాబు పాల్గొన్నారు.

శివశక్తి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని అందుగుల కొత్తపాలెం పంచాయతీ పార్వతీపురంలోని శ్రీ పాతపాటి పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



నేటి నుండి 'వేసవి విజ్ఞాన వినోదం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుండి విద్యార్థులకు వేసవి విజ్ఞాన వినోదం కార్యక్రమం నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధి కార భాష సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, గ్రం థాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డా.పి.వి. సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు చుక్కా విన్సెంట్ పాల్, దారా కొండయ్య, గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి నాగుల్ మీరావలి, సిబ్బంది సరోజిని, సాంబిరెడ్డి వున్నారు.



ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజల సద్వినియోగం చేసుకోవాలని నల్లపాటి ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక చిలకలూరిపేట రోడ్ లోని అరటికాయల గోడౌన్స్ వద్ద నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'హెల్దీ నరసరావుపేట' పేరుతో నియోజకవర్గంలో ఇప్పటికే అనేక గ్రామాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నామని రామచంద్రప్రసాద్ అన్నారు.. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, జ్వరం వంటి వ్యాధులతో పాటు గుండె ఊపి రితిత్తులు, కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వ హించి ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు అందించిన వైద్య బృందాన్ని ఘనంగా సన్మానించి , ట్రస్ట్ జ్ఞాపికలను అందజేశారు.

పులిచింతల వద్ద హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-అచ్చంపేట

మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను పోలీసులు ఆదివారం ఏర్పాటు చేశారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ప్రాజెక్టు సందర్శనకు వచ్చి సరదాగా నదిలో దిగి స్నానం చేస్తుంటారు .గతంలో ప్రాజెక్టు వద్ద స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనల దృష్ట్యా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నదీ ప్రవాహాల వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు అచ్చంపేట ఎస్సై కె.రవీంద్రపాల్ తెలిపారు. పుష్కరాల సమయంలో నది వెంబడి పుష్కర ఘాట్లు ఏర్పాటు చేశారని, దేవాలయాలకు పుణ్యక్షేత్రాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.





పులుల సంచారంపై ఆందోళన వద్దు

ప్రజాశక్తి - దుర్గి

మండల పరిధిలోని కాకిరాలలో స్థానిక అటవీ శాఖాధికారులు వసూల్ సిబ్బంది తో కలిసి గ్రామంలో పర్యటించారు. పులుల సంచారంపై ఆందోళన చెందవద్దని వారికి సూచించారు. వదంతులు నమ్మవద్దని ఏదైనా అడవి నుంచి గ్రామం సమీపంలోకి వన్య వన్యప్రాణులు వస్తే తమ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. సెక్షన్ ఆఫీసర్ కె వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి: టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి టిడిపి నాయకులు కన్నా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పాకాలపాడు లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిన మిర్చి ,మొక్కజొన్న, పొగాకు పంటలను టిడిపి నేతలతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. పంటను కాపాడుకునేందుకు రైతులకు టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని విమర్శించారు. దెబ్బతిన్న పంటలను అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతలు కొణికినేని సత్యనారాయణ, కోమటినేని శ్రీనివాసరావు మక్కపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **పెదకూరపాడు:** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం ఇవ్వాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలం లోని లింగంగుంట్లలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మిరపకాయలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి తెలుసుకున్నారు. **అచ్చంపేట:** అకాల వర్షానికి



తడిచి , మిర్చిని, మొక్క జొన్న పంటలను ప్రభుత్వ కొనుగోలు చేయా లంటూ అచ్చంపేట మండలం టిడిపి నాయ కులు డిమాండ్ చేశారు ఆదివారం అచ్చంపేట మండలంలో వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను మాట్లాడి వివరాల్ అడిగి తెలుసు కున్నారు. పండించిన పంటకు ప్రభుత్వం గిటు ్బాటు ధర కల్పించాలన్నారు. అనంతరం అచ్చం పేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా ఇచ్చి మిగిలిన సబ్సిడీ పథకాలన్నీ ఇవ్వకుండా వారిని మోసం చేస్తోందని విమర్శించారు. రైతులను పరామర్శిం చిన వారిలో మాజీ ఎంపీటీసీ పూల కోటేశ్వం ్రావు, కోనూరు మాజీ సర్పంచ్ తాళ్లూరు లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో దామోదరం సంజీవయ్య 52 వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాయకులు ఆయన చిత్ర పఠానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి,నియోజకవర్గ సమన్వయ కర్త ఎం. రాధాకృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా, అల్లూరి సీతారామరాజు వర్ధంతి, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, మనసు కవి ఆత్రేయ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.



పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

రాజకీయ లబ్ధి కోసమే వారి ఆర్థిక సాయం : అంబటి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైతులకు నష్టపరిహార చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అంబటి రాంబాబు ఆదివారం అందచేశారు. నకరికల్లు మండలం గుండ్లపల్లి, చీమలమర్రీ గ్రామాలకు చెందిన వారికి రూ.9.75 లక్షల సిఎం చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసంమే జనసేన, టిడిపి నేతలు గంగమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ అమ్మకానికి పెట్టిన జనసేన పార్టీ రూ.4 లక్షలు ఇస్తే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రూ.2 లక్షలే ఇవ్వటం దారుణమన్నారు. గంగమ్మ అన్న కుటుంబానికి ఎందుకు సహాయం చేయటం లేదని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసినందుకే జననేన, టిడిపి పోటాపోటీగా గంగమ్మ కుటుంబానికి సహాయం చేస్తున్నారని విమర్శించారు.

వివాహాలకు హాజరైన ఎమ్మెల్యే పిన్నెల్లి

ప్రజాశక్తి-వెల్దుర్తి : వెల్దుర్తి మండలం గంగల కుంట గ్రామానికి చెందిన వడ్ల రమణారెడ్డి కుమారుడు విజయరామిరెడ్డి వివాహ కార్య క్రమంలో ప్రభుత్వ విప్ పల్నా డు జిల్లా అభివద్ధి మండలి చైర్మన్ మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పల్నాడు జిల్లా వ్యవ సాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, చింత ఆదినారా యణ ఉన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


ప్రజాశక్తి-వెల్దుర్తి : మండల కేంద్రములోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండ పంలో పులుసు రాజశేఖర్ రెడ్డి వివాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పల్నాడు జిల్లా వ్యవ సాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి ఉన్నారు.

పుష్పాలంకరణ కార్యక్రమంలో..


ప్రజాశక్తి-వెల్దుర్తి : వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన తేలుకుట్ల ఆంజ నేయలు కుమార్తె వెంకటేశ్వరి పుష్పాలం కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం లో చింత ఆదినారాయణ, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వివాహమహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-పెదకూరపాడు : పెదకూరపాడులో తెలుగుదేశం పార్టీ నాయ కులు కృష్ణమనేని చిన్న కుమారుడు అరవింద్-దేవి కల వివాహ మహో త్సవం



వేడుకలకు ఆదివారం సత్తెన పల్లి మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు హాజరయ్యారు. నూతన దంపతులను ఈ సందర్భంగా అభి నందించారు.



రోశయ్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ లు ఆదివారం ఆవిష్కరించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కాటూరి శిల్పశాల శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు రూపు దిద్దారు. స్థానిక సాలిపేటలోని పాత సత్యనారాయణ టాకీస్ మార్గానికి కొణిజేటి రోశయ్య ద్వారంగా నామకరణం చేసారు. అనంతరం టిడిపి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమానికి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షులు నూకల వేణు, వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పలువురు వైసిపి, టిడిపి నాయకులు హాజరయ్యారు.



జగదీష్‌కుమార్‌కు మాతృవియోగం - సిపిఎం నివాళి

ప్రజాశక్తి-దుగ్గిరాల: మండలంలోని చిలురువూరు గ్రామం ప్రముఖ ఫార్మా కంపెనీలు అధినేత రంగిశెట్టిసంస్థ ఫౌండర్ జగదీష్ కుమార్ తల్లి సావిత్రి హైదరాబాద్‌లో ఉంటూ అస్వస్థతకు గురై ఆదివారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని స్వగ్రామం చిలురువూరుకి తీసుకువచ్చారు. ఆదివారం సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, ప్రముఖ లాయర్ వై. స్టాలిన్, పార్టీ నాయకులు వి. సాంబశివరావు, వై బ్రహ్మేశ్వరావు, అంబేద్కరిస్టు యన్ యేషయ్యలు ఆమె భౌతిక కాయం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగదీష్ కుమార్ పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పేదలకు ధాన ధర్మాలు చేస్తూ సమాజ సేవ చేసే ఆలోచన తత్వం ఉన్న వ్యక్తి అని అన్నారు. కొన్ని గ్రామాలు దత్తత తీసుకుని అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వర్షం పడితే రోడ్లు కాల్వలే..!

- 5వ వార్డులో తాగునీటి సమస్య
- అధికారులకు విన్నవించినా పట్టని వైనం



రోడ్డు పై నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజాశక్తి-పెదకాకాని

మండలంలోని నంబూరులో రఫత్ కాలనీ వాసులకు వర్షం పడిందంటే రోడ్లు కాలువలను తలపిస్తుంటాయి. ఈ రోడ్లపై నడవాలన్నా , వాహనాలను బయటకు తీసుకురావాలన్నా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొద్దిపాటి వర్షాలకే ఇలాంటి పరిస్థితితులు నెలకొంటే వచ్చే వర్షకాలంలో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్థానిక పేద ప్రజలు, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ఉద్యమం చేసి 290 ఇళ్ల స్థలాలు సాధించుకున్నారు. అయితే రోడ్లు, తాగునీటి సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలు మాత్రం ఇప్పటికే నెరవేరని కలల మారింది. కాలనీలోని 5వ రోడ్డులో తాగునీటి సమస్య తాండవిస్తుంది. రోడ్ల సమస్య ఒక వైపు అయితే తాగు నీటి సమస్యతో మరో వైపు తీవ్ర ఇబ్బందులను కాలనీ వాసులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న సమస్యలు పరిస్కారం జరగడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానిక నివాసులు కోరతున్నారు.

ఎకో హిల్ పార్క్‌పై ట్రెక్కింగ్

ప్రజాశక్తి- మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఆదివారం షుమారు 50 మంది రోటరీ క్లబ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎయిమ్స్ వద్ద గల ఎకో టెంపుల్ హిల్ ట్రెక్కింగ్ చేశారు. క్లబ్ అధ్యక్షులు అర్‌టిఎన్. త్రిపురమల్లు సతీష్ బాబు మాట్లాడుతూ మంగళగిరి ప్రజలకు ఇలాంటి సౌకర్యం ఇక్కడ దొరకడం అదృష్టమని తెలిపారు. మా కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేసవి విడిదిగా,పిల్లలందరితో కలిసి కొత్తగా ఏర్పాటు చేసిన మార్గంలో ట్రెక్కింగ్ చేస్తూ ప్రకృతిని తిలకించామని తెలిపారు. వెళ్లే దారిలో,ఏ విధమైన ప్లాస్టిక్ వ్యర్ధాలు లేకుండా ఉండాలని భావించి,మా రోటరీ సభ్యులందరం,మా కుటుంబ సభ్యులతో కలిసి దారి పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రైనర్ అనీల్ చక్రవర్తి, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, టి.రామకృష్ణ, డి.శ్రీనివాసరావు, నిరంజన్ గుప్తా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ కుటుంబ సభ్యులు



క్రీడా కిట్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- దుగ్గిరాల

స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం టిడిపి పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత మాట్లాడుతూ క్రీడలు, విద్య నేటి యువతకు ముఖ్యమైనవని తల్లితండ్రులు విద్యను ప్రోత్సహిస్తున్నారు కాని క్రీడలు ప్రోత్సహించడం లేదన్నారు. నారా లోకేష్ క్రీడాకారులు సౌకార్యార్థం ట్రోర్నమెంట్ ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకట్రావు ,దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ , మండల కార్యదర్శి తాళ్ళ అశోక్, ఇన్సాన్ గ్యాస్ అధినేత గద్దె శ్రీనివాస్ , వి.వాసిరెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వారం గడిచినా అందని పెన్షన్

ప్రజాశక్తి తెనాలి రూరల్: ఒకటో తారీఖు వచ్చి వారం గడిచిన పెన్షన్లు జమ కాకపోవడం బాధాకరమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యాదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేట పెన్షనర్ల హోమ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తున్న విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు ఇప్పటివరకు రాకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులు పెన్షన్లు మీదే ఆధారపడి ఉంటారని, తద్వారా వారికి కావాల్సిన నిత్యావసరాలు, మందులు తప్పనిసరని పేర్కొన్నారు. తమ పెన్షన్లు కోసం విశ్రాంత ఉద్యోగులు బ్యాంకులు, సబ్ ట్రెజరీ, పెన్షనర్ల కార్యాలయాల చుట్టూ తిరగడం సమంజసం కాదన్నారు. పెన్షనర్లకు రావాల్సిన జీతభత్యాలను ప్రతినెల ఒకటో తేదీన తమ బ్యాంకు ఖాతాల్లో జమయ్యేటట్లు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

1న మహాకుంభాభిషేకం

ప్రజాశక్తి-పెదకాకాని



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణని విజయవాడలో వారి క్యాంపు కార్యాలయంలో పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూన్ 1,2,3వ తేదీలలో నిర్ణయించిన మహాకుంభాభిషేకం గురించి గౌరవ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీ ఈమని చంద్రశేఖర్ రెడ్డి కూడా ఉన్నారు.

వైకుంఠపురం ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్త-తెనాలిరూరల్: స్థానిక వైకుంఠపురం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలను తేదీ మే 8 వ తేది నుండి 14వ తేది సోమవారం వరకు నిర్వహించబడునని సహాయ కమీషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం తిమ్మానాయుడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తేదీ 8,9 తేదీలలో కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీలు, 10,11 తేదీలలో భక్తి పాటలు పోటీలు అనంతరం అన్నమయ్య సంకీర్తనలు, భరతనాట్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థి తన్మయను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

విద్యార్థిని తేజో తన్మయకు సత్కారం

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి మండలంలోనే మొదటి ర్యాంక్ సాదించిన అక్షయ విద్యాలయం విద్యార్థి వెలగా తేజో తన్మయను ఆదివారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సత్కరించి అభినందనలు తెలిపారు. అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి, డైరెక్టర్ వెలగా శ్రీవల్లి మేకతోటి సూచరిత నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సుచరిత మండలంలో మొదటి ర్యాంక్ సాదించిన విద్యార్థిని వెలగా తేజో తన్మయ 585 మార్కులు సాధించిడం అభినందనీయమని శాల్వాతో సత్కరించారు. వీరితో పాటు 500 పై బడి మార్కులు సాదించిన కుంచాల జ్యోతి (557/600), షేక్ ఖాశిం షరీఫ్ (552/600), కావూరి నాగ సురేష్ (539/600), గొరిజవోలు జ్ఞానతేజ (535/600)లకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో బాగా చదివి, మరిన్ని విజయాలు సాధించి, ఉన్నతమైన స్థాయిలో స్థిర పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివం యుఆర్ మిషన్ చైర్మన్ ఉప్పల రఘుబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థిని దీప్తి మాధురిని సత్కరిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్

దీప్తి మాధురికి సత్కారం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్: సమాజాబివృద్ధికి విద్య మూలమని విలువలతో కూడిన ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అశోక పాఠశాలకు చెందిన ఉన్నవ దీప్తి మాధురి 600కి 570 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిండం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ దీప్తి మాధురిని ఘనంగా సత్కరించారు. ఎఎస్ఐ కృష్ణస్వామి అశోక పాఠశాల కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణలు ఉన్నారు.

మండలం మొదటి స్థానంలో హిమజ

ప్రజాశక్తి-పెదకాకాని: మండలంలో పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు ఆదివారం పలువురు అభినందనలు తెలిపారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎన్.వెంకటశ్రీనాగలక్ష్మీ హిమజ 577 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే పెదకాకాని గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల నుండి మహ్మద్ కైఫ్ 574 మార్కులతో రెండో స్థానం సాధించారు. మండలంలోని ప్రైవేట్ స్కూల్ జెఎంజె స్కూల్ విద్యార్థిని టి. హరిత 575 మార్కులు సాధించగా, గీతాంజలి స్కూల్ స్టూడెంట్ 573 మార్కులు సాధించారు. మండల ప్రథమ స్థానంలో నిలిచిన హిమజను పలువురు అభినందించి సత్కరించారు.



ఎన్.వెంకటశ్రీనాగలక్ష్మీ హిమజ

సత్తా చాటిన రాయల్ హైస్కూల్

ప్రజాశక్తి-తాడేపల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నులకపేట రాయల్ హైస్కూల్ తన సత్తా చాటింది. 581 మార్కులతో ఎండి సాఫియా సుల్తానా పాఠశాల టాపర్‌గా నిలిచింది. టివిఎన్ఎస్ కీర్తన 575, ఎస్‌కె గౌసియా మౌన 573, ఎస్‌కె షానా ఫర్ష 562, ఎండి ఆయేషా సిద్ధిక్ 553 మార్కులు సాధించారు. 57 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 51 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఆజాద్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

నెంబర్ వన్‌గా ప్రగతి బాల విద్యాలయం

ప్రజాశక్తి-తాడేపల్లి: పదో తరగతి ఫలితాల్లో సుందరయ్యనగర్ ప్రగతి బాల విద్యాలయం నెంబర్ వన్‌గా నిలిచిందని కరస్పాండెంట్ ఎస్.గిరిజకుమారి, ప్రిన్సిపల్ వై.వెంకటరత్నం (నాని) తెలిపారు. బి.పూర్ణసాయి మణిదీప్, బి.భువనకృతి 586 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారన్నారు. బి.కీర్తన, బి.భరత్‌సాయి 571, డి.హరిత, డి.ఆకాంక్ష, జె.ప్రసన్నరూప, డి.యోగేందర్, ఎ.బేబిసరోజ, ఎం.హరికృష్ణ, జి.సంధ్య, కె.మౌనిక, ఎం.ప్రవల్లిక, జి.లక్ష్మి, డి.అయ్యప్ప వరుసగా 549, 548, 544, 542, 539, 538, 522, 512, 500, 521, 519 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాల నుంచి పరీక్షకు హాజరైన వారిలో 500 మార్కులు దాటిన వారిలో 15 మంది, 400 దాటిన వారిలో 20 మంది ఉన్నారని చెప్పారు. మూడు సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘన విజయం సాధనకు కారణమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ పి. వెంకటేశ్వరరావు

టెన్త్ ఫలితాల్లో లోటస్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-గుంటూరు: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక కష్ణనగర్ లోటస్ హైస్కూల్ విద్యార్థులు 95 శాతం ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పాఠశాలలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజరైన 30 మంది విద్యార్థులలో 15 మంది 500 పైగా మార్కులు సాధించారని, షేక్ ఆర్సియా నవీన్ 588 మార్కులుతో అగ్రస్థానంలో నిలవగా అక్షయ రాణి, లోకేశ్వర్, వెంకట్, హిమబిందు 550 పైగా మార్కులు సాధించారన్నారు. ప్రిన్సిపాల్ సి. ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు

పంట నష్టం అంచనాలు నమోదు

ఆకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై పరిశీలి స్తున్నామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాలు పూర్తిగా తగ్గగానే నష్టం వివరాలు పూర్తిగా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రాథమిక అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చామని, వర్షాలు కొనసాగితే ఇంకా నష్టం పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలిపారు.

- వర్షాలు ఆగగానే పూర్తిస్థాయి పరిశీలన
- ఆర్‌బికేల ద్వారా తొలకరికి విత్తనాలు సిద్ధం
- ఇకెవైసి చేసుకోని వారు వెంటనే చేయించుకోవాలి
- ప్రజాశక్తితో గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు

అకాల వర్షాల వల్ల ఏయే పంటలకు నష్టం?

జొన్న, మొక్కజొన్న, ఆలస్యంగా సాగు చేసిన మిర్చి పంటలకు నష్టం ఉంది. నష్టం తీవ్రత ఎంత ఉందనే అంశంపై వర్షాలు తగ్గిన తరువాతనే పూర్తిస్థాయిలో సర్వే చేస్తాం. తరువాత ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం.

ప్రాథమిక అంచనాల ప్రకారం నష్టం ఎంత?

గుంటూరు జిల్లాలో మొక్కజొన్న 60 వేల ఎకరాలు, 30 వేల ఎకరాల్లో జొన్న సాగు చేశారు. మొత్తం సాగులో 70 శాతం మొక్కజొన్న, 95 శాతం జొన్న కోతలు



పూర్తయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం పంట కోయకుండా ఉన్న వాటిల్లో ఐదు వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో జొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించాం.

పంటను కాపాడుకునేందుకు ఏంచేయాలి?

పంటపై ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. పరిస్థితులను బట్టి రైతుల ఈ ప్రక్రియ కొనసాగించాలి. కొన్నిచోట్ల పంట చివరి దశలో ఉన్నందున పరిశీలన అవసరం.

మిర్చి పంటకు ఎంత వరకు నష్టం ఉంటుంది?

మిర్చి ఆలస్యంగా సాగు చేసిన ప్రాంతాల్లో కొంతనష్టం జరిగింది. అక్టోబరు కంటే ముందు సాగు చేసిన ప్రాంతాల్లో కోతలు పూర్తయ్యాయి. అక్టోబరు తరువాత సాగు చేసిన ప్రాంతాల్లో చివరిదశ కోతల సమయంలో వర్షాలకు కొంత నష్టమైనట్లు భావిస్తున్నాం. మిర్చి నష్టం అంచనాలను ఉద్యాన శాఖ పరిశీలిస్తుంది.

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధత?

ఆర్‌బికేల ద్వారా అన్ని రకాల విత్తనాలను సిద్ధం చేస్తున్నాం. తొలి దశలో తొలకరి పంటలుగా పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేస్తున్నాం. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఇప్పటికే ఆర్‌బికేల్లో అందుబాటులో ఉంచాం. వీటిని రైతులు 50 శాతం సబ్సిడీతో తీసుకోవచ్చు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు?

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. గతేడాది ఇచ్చిన రైతులు అదే పొలంలో కొనసాగితే వాటిని భూ యజమానులతో మాట్లాడి రెన్యూవల్ చేస్తాం. భూమి మార్చుకుంటే కొత్త దరఖాస్తు తీసుకుని సిసిఆర్‌సిలు ఇస్తాం.

రైతు భరోసా, పిఎంకిసాన్ దరఖాస్తు చేయాలా?

ఈ ఏడాది రైతు భరోసా, పిఎం కిసాన్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేయనక్కర్లేదు. గతేడాది తీసుకున్న రైతుల పేర్లను పరిశీలించి ప్రభుత్వానికి పంపుతున్నాం. భూ యజమాని మారినా, ఎవరైనా మరణించినా, ఇతర అంశాలు ఏమైనా ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. మిగిలిన వారికి అవసరం లేదు. ఇకెవైసి చేసుకున్న వారికే పిఎం కిసాన్ పథకం వస్తుంది. ఇప్పటి వరకు చేసుకోని వారు వెంటనే ఆర్‌బికేల్లో, మీ-సేవా కేంద్రాల్లో ఇకెవైసి చేసుకోవాలి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఐఎఎస్ సాధనకు ఏకాగ్రత అవసరం

ఫౌండేషన్ శిక్షణ తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఐఎఎస్ వంటి సివిల్ సర్వీసులకు హాజరయ్యే అభ్యర్థులకు కచ్చితమైన, స్పష్టమైన లక్ష్య సాధనతో కూడిన కృషి అవసరమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట యుటిఎఫ్ సమావేశ మందిరంలో కెవిఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐఎఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులను లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఎస్ గానీ, ఇతర సివిల్ సర్వీసులు రాయదలుచుకున్న వారికి 21 సంవత్సరాలు నుండి 32 ఏళ్లలోపు వయస్సుతో పాటు, డిగ్రీ కనీస అర్హతగా ఉంటుందని చెప్పారు. సివిల్స్ పరీక్షలు ప్రధానంగా మొదటి పరీక్ష ప్రిలిమ్స్‌లో జనరల్ స్టడీస్, సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా 400 మార్కులకుగాను కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుందన్నారు. మెయిన్స్ పరీక్షల్లో కూడా 1750 మార్కులకుగాను 50శాతంపైగా సాధించినవారు ఇంటర్వ్యూకు అర్హత సాధిస్తారని వివరించారు. ర్యాంకుల ఆధారంగా ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ వంటి కేడర్లకు ఎంపిక చేయబడతారని తెలిపారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ కార్యదర్శి సాయికుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ శిక్షణ పూర్తి చేసిన అశ్విన్ కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు టిఆర్ రమేష్, డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్) ప్రశాంతంగా జరిగింది. అత్యంత కట్టుదిట్టమెన ఏర్పాట్ల మధ్య పరీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.20 వరకూ నిర్వహించిన పరీక్షకు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు. దుస్తులు, ఆభరణాలు, చెప్పులు నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించారు. జిల్లాలో ముఖ్యంగా గుంటూరు, నగరం చుట్టుపక్కల 12 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 5069 మందికిగాను 4990 మంది (98.4 శాతం) హాజరయ్యారు. గుంటూరు నగరంలో పలు డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్, హిందూ ఫార్మసీ, ఆర్‌విఆర్, కిట్స్, కేంద్రీయ విద్యాలయం తదితర కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.



సాక్సులను తొలగిస్తున్న విద్యార్థిని

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - వినుకొండ : అకాల వర్షానికి తడిని, రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తహశీల్దార్ కిరణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని నరగాయపాలెం, పెద్దకంచర్ల, ఏనుగుపాలెం ఆదివారం సందర్శించిన అధికారులు పంటల పరిస్థితిపై రైతులతో మాట్లాడారు. వర్షం వల్ల పంట దెబ్బతింటే రైతు భరోసా కేంద్రాల్లో తెలపాలన్నారు. మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ రకమైతే క్వింటాళ్ రూ.2060, సాధారణ రకమైతే రూ.2040కు కొంటామని చెప్పారు. మొక్కజొన్న పంటను అమ్మదలచిన రైతులు ఆర్బికేల ద్వారా విక్రయించుకోవాలని క్వింటాళ్ రూ.1962కు కొనుగోలు చేస్తారని తెలిపారు.